## సింగిల్ పేజీ కథలు

ట్రింగ్...ట్రింగ్...ట్రింగ్...

ఫోన్ మోగుతున్న ధ్వనితో నిద్రలేచిన పరశురామయ్య రిసీవరందుకుని "హలో" అన్నాడు.

"నేను నాన్నగారూ...విజయ్‌ని! అమ్మ లేదా?"

'విజయ్' అన్న పేరు వినడంతోనే ప్రఫుల్లమైంది ఆయన వదనం. అమ్మ లేదా అన్న మాటతో నిర్వికారమైంది. అయినా సర్దుకుని- "ఏం బాబూ బాగున్నావా? అక్కడ నీకేం లోటు లేదు కదా!" ఆప్యాయత నిండిన స్వరంతో అడిగారు.

"నాకంతా బాగానే ఉంది నాన్నగారూ! అమ్మని పిలుస్తారా మాట్లాడాలి!" అప్పటికే పక్కకి వచ్చి నిల్చున్న భార్యకి రిసీవరందించాడు అన్యమనస్కంగానే.

హైస్కూల్ హెడ్మాస్టర్ పరశురామయ్య...నిజంగా పరశురాముడిలాగే ప్రవర్తించేవాడు తన పిల్లల పట్ల.

స్కూల్‌లో స్టూడెంట్స్ దగ్గర ఎంత స్ట్రిక్ట్‌గా వ్యవహరించేవాడో అంతే స్ట్రిక్ట్‌నెస్ చూపేవాడు తన పిల్లల దగ్గర.

అలాగని అతను కఠినాత్ముడు కాదు! తన బిడ్డలంటే అతడికి వల్లమాలిన ఆపేక్ష... అభిమానమూను! కానీ అవి ఎప్పుడూ కనబర్చేవాడు కాదు. తమ పిల్లలు తమ కలల పంటలు. అవి ఫలించాలంటే తను చనువివ్వకూడదు.

వారు ఉన్నత విద్యావంతులు కావాలి. ఫలానా హెడ్మాస్టర్ పిల్లలు వీళ్లు! శెభాష్! అని పదుగురు మెచ్చుకునే విధంగా ఉండాలి. అలా వారు రూపుదిద్దుకోవాలంటే తన మనసులో దాగున్న మమత ఎప్పుడూ వెల్లడి చేయకూడదు అనేది ఆయన సిద్ధాంతం. ఆయన కోరిక ప్రకారమే అజయ్ విజయ్‌లిద్దరూ ఎంతో భయభక్తులతో చదివి పెరిగి పెద్దవారయ్యారు.

అజయ్ చెన్నైలో బ్యాంక్ మేనేజర్‌గా చేస్తుంటే.. విజయ్ కంప్యూటర్ ఇంజినీర్ అయి ఫారిన్ వెళ్లాడీ మధ్యనే.

ఇప్పుడు పరశురామయ్యగారు రిటైర్ అయి ఇంటి పట్టునే ఉంటున్నారు. "అణకువ గల భార్య. ముత్యాల్లాంటి బిడ్డలు. ఆయనకేం? చీకూ చింతా లేని జీవితం!" పలువురు ఆయన గురించి అనుకునే మాటలివి.

కానీ...ఆయనకు మాత్రమే తెలుసు తనెంత పెద్ద తప్పు చేశాడో! తను కోల్పోయినదేమిటో అన్నది.

తనో పెద్ద ఫూల్! మనసులోనే తనని తను తిట్టుకుని పరితపిస్తుంటాడాయన.

"మా ఫ్రెండ్ వాళ్లు వారానికోసారి సిన్మాకెళ్తున్నారు. మీరు మమ్మల్ని మూడు నెలలకోసారి మాత్రమే సిన్మాకు తెసుకెళ్తారు" బుంగ మూతితో అనే అజయ్.

"ఈమధ్యలో పార్క్‌కైనా సర్కస్‌కైనా వెళ్తే అవి కూడా కట్ కదా!" కోపంగా అనే విజయ్ మాటలు గుర్తొస్తుంటే శుష్క హాసం మెదులుతుంది పెదాలపైన.

పిల్లలతో ఆడుతూ పాడుతూ తిరగకుండా తనేం సాధించాడు! పిల్లల హృదయాలలో తనో రాక్షసుడిగా మిగిలిపోవడం.. ప్చ్. భగవాన్!

# అంతర్మథనం

తనను మళ్లీ ఓ ఇరవై యేళ్ల వెనక్కి తీసుకెళ్లకూడదూ? తన తప్పు దిద్దుకుంటాడు. ఏముంది జీవితం? రొటీన్. నిర్లిప్తత. అసంతృప్తి.

మరి తన భార్యకో? ఆమె మొహంలో కాగడా వేసి వెదికినా అసంతృప్తి అన్నదే కానరాదు.

ఆమె తనలా వాళ్ల దగ్గర చదువు సంధ్యల గురించీ, డిసిప్లిన్ గురించీ ఏకరువు పెట్టలేదు సరికదా పై పెచ్చు గారాబం చేసేది.

"నీ గారాబం ఎక్కువైతే వాళ్లు చెడిపోతారు పూర్ణా! వాళ్లలో మంచి క్రమశిక్షణ అలవడాలంటే నువ్వు కూడా వారి చదువు పట్లా పెంపకం పట్లా శ్రద్ధ వహించాలి" అని తనెప్పుడైనా వినుక్కుంటే మీరు చూపించే డిసిప్లినే ఎక్కువై పోతుంది. ఇక నేను కూడా మీలా కఠినంగా వ్యవహరిస్తే పిల్లలు బెదిరిపోతారంటూ కొట్టి పారేసేది.

'తాను కరెక్టా...తన భార్య కరెక్టా?'

"ఏమండీ...ఏమండోయ్"

భార్య వేసిన కేకతో ఉలిక్కిపడ్డాడు.

"అబ్బ! ఏమిటండీ పరధ్యానం? బాబుకు మనల్ని చూడాలనుందట." ఫోన్ క్రెడిల్ చేస్తూ చెప్పిందామె.

"నిన్ను చూడాలనుందన్నాడు అంతే కదా"

"నన్ను! అంటే మనిద్దర్నీ అనే కదండీ అర్థం. వాడికి అక్కడ అంతా బాగానే ఉందట కానీ, నాతో రోజూ మాట్లాడలేకపోవడం పిచ్చెక్కినట్లవుతుందట. పిచ్చి సన్నాసి. వాడిని వదిలి ఉండటం నాకు మాత్రం బాధగా లేదూ!" ఆవిడ చెప్పుకుపోతుంది తన ధోరణిలో. పరశురామయ్యగారు ఆమెని చూస్తున్నారు కానీ ఆయన మనస్సక్కడ లేదు...కొడుకు దగ్గరకెళ్లిపోయింది.

"బాబూ! ఒక లక్ష్యంతో నేను మీ పట్ల చనువు చూపించి ఉండకపోవచ్చు! ఆప్యాయత, అనురాగాలు కనబరచి ఉండకపోవచ్చు. అలాగని నన్ను దూరంగా నెట్టేస్తారా? అన్నయ్య ఫోన్ చేసి వాడూ అమ్మ కావాలంటాడు. నువ్వూ అమ్మతోనే మాట్లాడాలంటావ్ తప్ప... నాతో మీకు మాటలే ఉండవా? నేను మీ పట్ల ముక్తసరిగా వ్యవహరించిన మాట వాస్తవమే. అది మీ మేలు కోరే అన్నది మీరు మర్చిపోతే ఎలా? మీరు మాకు డబ్బు పంపనక్కర్లేదు. బట్టలివ్వనక్కర్లేదు. ప్రేమగా రెండు మాటలు మాట్లాడండిరా చాలు. నేను చేసింది తప్పయితే నన్ను క్షమించండి. ఈ ముసలి వయసులో మీరు నా పట్ల శ్రద్ధ వహించకపోవడం నేను తట్టుకోలేనురా" ఆవేదనతో పరితపించింది ఆయన హృదయం.

తల్లిదండ్రులకి పిల్లల పట్ల ప్రేమ ఉండటం సహజమే. దానిని 'అంతర్గతంగా ఉంచాలే తప్ప బహిర్గతం చేయకూడదు' అనేది ఆయనకు తెలిసిన నీతి. దానిని అనుసరించి తనేం సాధించాడు? పిల్లలకి దూరమవ్వడం తప్పు! అని మనసులోనే మధనపడుతుంటారాయన.

దేశానికి వారిని మంచి పౌరులుగానూ, ఉన్నత విద్యావంతులుగానూ తీర్చిదిద్ది ఒక వ్యక్తిగా గెలిచినా... కన్నతండ్రిగా మాత్రం ఓడిపోయాను. బాధగా అనుకుంటూంటారు.

ఆ బాధని మర్చిపోటానికీమధ్య ఫ్రెండ్స్ సర్కిల్ ఏర్పరచుకున్నారు. సాయంత్రం ఐదయ్యేటప్పటికి అంతా ఒక చోట ఒనగూడుతూరు. దైవం గురించి కాస్సేపు, పుస్తకాల గురించి కాస్సేపు, రాజకీయాల గురించి మరికాస్సేపు తమకిష్టమైన రీతిలో ముచ్చటించుకుంటూ-

ఆ రోజు కూడా ఫ్రెండ్స్‌తో బాతాఖానీ టైమవ్వడంతో చెప్పులు వేసుకుని బైటకి నడవసాగారు.

నాలుగిళ్లవతల ఉన్న రామం ఇంట్లోంచి అరుపులు, పిల్లాడి ఏడ్పు వినరావడంతో టక్కున ముందుకెళ్లడం ఆపి, అనుకోకుండా అటువేపు నడిచారు.

ఆ ఇంట్లో సీను చూడగానే నొచ్చుకున్నారు.

రామం నున్నటి పేము బెత్తం తీసుకుని పన్నెండేళ్ల తన కొడుకుని చావబాదుతున్నాడు నోరు చించుకునేలా అరుస్తూ.

"ఏమిటి ఏమైంది రామం? ఎందుకు వాణ్నలా కొడుతున్నావ్?"

"చూడు బాబాయ్ ఇప్పుడే ఇంత దల్ అయిపోతే ఈ పోటీ ప్రపంచంలో ఇంకా ముందు ముందు ఎలా నెగ్గుకొస్తాడు? మాటలతో చెపుతుంటే వీడికెక్కడా చెవికెక్కడం లేదు" అంటూ మళ్లీ ఒకటేశాడు. వాడు మళ్లీ ఏడ్పు.

బెత్తం లాగి పడేసి వాణ్ని దగ్గరికి తీసుకుంటూ "రామం! జీవితమంటే పిల్లల్ని టార్చర్ చేయడం కాదురా! వాడి మనసులో నువ్వే మంచి తండ్రిగా ఇప్పట్నించే ముద్రించుకోవడానికి ప్రయత్నించరా ఆయనకి అర్థమైన సత్యంతో హితబోధ చేయబోయారు.

"ఊరుకో బాబాయ్. నువ్వలా పిల్లల్ని ముద్దు చేసి ఉంటే మీ వాళ్లీ రోజు ఇంతవాళ్లయ్యుండే వారా? వీడు నన్నెప్పుడో ఉద్ధరించకపోయినా ఫర్వాలేదు గానీ బాగా చదివి ప్రయోజకుడైతే చాలు" దురుసుగా అన్నాడు రామం.

'ఇతడికీ తనలా మధనపడే రోజొస్తుందా?' బైటకొస్తూ అనుకున్నారాయన.

-సిహెచ్.లక్ష్మి

(కుందువాడ, కర్నాటక)